

ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పేజీలు : 4 సంపుటి : 01 - సంచిక 182 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ శనివారం 05- 10 - 2024 వెల - 2

Digital Edition



L.K.R COLLEGE OF NURSING
(Affiliated to Dr. N.T.R U.H.S Vijayawada)
Near J.V.R.R. ITI, V.C. Colony, Nandyal - 518502
అడ్మిషన్లు జరుగుచున్నవి
4 సం॥ల B.Sc., నర్సింగ్ కోర్స్,
అర్హత: ఇంటర్ Bi.P.C., మరియు ఒకేషనల్ నర్సింగ్ పాస్ అయిన విద్యార్థినీ, విద్యార్థులు EAPCET అర్హత సాధించిన వారు అర్హులు.
(మేనేజ్‌మెంట్ కోటా నందు కొన్ని సీట్లు కలవు)
పూర్తి వివరములకు:
85200 10739, 85200 23866
జె.లక్ష్మికాంత రెడ్డి, చైర్మన్


## కమిషనరమ్మ.. తాళం వైపు చూడమ్మ







హైదరాబాద్ అక్టోబర్ 4( రిపబ్లిక్ న్యూస్)

ప్రజల చేత.. ప్రజల కోసం.. ప్రజలే ఎన్నుకున్న ప్రభుత్వాలకు ముందు చూపు లేక పోవడంతో.. ప్రజలు పడుతున్న అవస్థలన్నీ ఇన్నీ కావు. గద్దెనెక్కిన పాలకా గణం.. ప్రజా సంక్షేమం కోసం అంటూ తీసుకుంటున్న పలు నిర్ణయాలు అభాసుపాలవుతున్నాయి. ఇంకా చెప్పాలంటే.. ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న నగదు బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అందుకు అత్యుత్తమ ఉదాహరణ విశ్వ నగరం హైదరాబాద్. గద్దెనెక్కే వరకు విశ్వనగరాన్ని న్యూయార్క్ చేస్తాం, డల్లాస్ చేస్తాం, సింగపూర్ చేస్తాం, మారిషస్ చేస్తామంటూ వివిధ రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల వేళ.. పలు ప్రకటనల ద్వారా ఉదరగొడుతున్నారు. ఇక ఎన్నికల్లో గెలిచిన తర్వాత.. ప్రచారంలో గుంపగుత్తగా ఇచ్చిన హామీలను నేతలు గాలికొదిలేస్తున్నారన్నది సుస్పష్టం.

-మిగతా2లో

## రేవంత్ సర్కారుకు బిగ్‌షాక్..

### హైకోర్టులో పిటిషన్ వేయనున్న వేలాది మూసీ బాధితులు..!!



తెలంగాణ అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)

రేవంత్ రెడ్డి సర్కారుకు మూసీ పరివాహక ప్రాంత ప్రజలు బిగ్ షాక్ ఇచ్చారు. వేలాది మంది ఒకేసారి హైకోర్టులో పిటిషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా తమ నివాసాలను కూలుస్తోందని, పునరావాసం కల్పించకుండా తాము ఉంటున్న నిర్మాణాలను ఒక్కసారిగా కూల్చివేస్తే తామంతా ఎక్కడికి వెళ్లాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమకు న్యాయం చేయాలని కోరుతూ కూల్చివేతలపై స్టే ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు సమాచారం.

అయితే, ప్రభుత్వం మాత్రం మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి, మూసీ సుందరీకరణలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నామని.. నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేయడానికి వచ్చిన వారికి రూ.25వేలు అందజేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. మొన్నటివరకు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలను బుల్డోజర్‌లతో కూల్చివేయించిన ప్రభుత్వం మూసీ నిర్వాసిత ఇళ్లను మాత్రం కూలీలను పెట్టించి కూలగొట్టిస్తోంది.

## ఇద్దరు డిప్యూటీ సీఎంల మధ్య సనాతన వార్






తమిళనాడు అక్టోబర్ 4( రిపబ్లిక్ న్యూస్)

తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయ్ నిధి స్టాలిన్‌పై పరోక్ష విమర్శలు చేయడం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. పవన్ వ్యాఖ్యలపై ఉదయ్‌నిధి స్టాలిన్‌తో పాటు డీఎంకే నేతలు స్పందిస్తున్నారు. ఉదయ్‌నిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేసి విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ కొందరు సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు..సనాతన ధర్మం పరిరక్షణ కోసం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రకటించిన డిక్లరేషన్ దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. తిరుపతి వారాహి సభతో పవన్ కళ్యాణ్ దేశం దృష్టిని ఆకర్షించారు. ఎవరిపై ప్రత్యక్షంగా ఆరోపణలు, విమర్శలు చేయకుండానే సనాతన ధర్మాన్ని విమర్శించే వ్యక్తులపై తనదైన స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయ్ నిధి స్టాలిన్‌పై పరోక్ష విమర్శలు చేయడం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. పవన్ వ్యాఖ్యలపై ఉదయ్‌నిధి స్టాలిన్‌తో పాటు డీఎంకే నేతలు స్పందిస్తున్నారు. ఉదయ్‌నిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేసి విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే.

-మిగతా2లో

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

### 30మంది మావోలు హతం..




ఎదురు కాల్పుల్లో 30మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను ఘటనా స్థలంలో గుర్తించినట్లు భద్రతా దళాలు తెలిపాయి. అలాగే మృతుల నుంచి భారీఎత్తున ఆటోమేటెడ్ ఆయుధాలు, ఏకే 47 సహా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు భద్రతా దళాలు తెలిపాయి. బస్తర్ ప్రాంతంలో ఈ ఏడాది 170మందికి పైగా మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు 4లో

దంతెవాడ:అక్టోబర్ 4( రిపబ్లిక్ న్యూస్)

## జగన్‌పై కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విసుర్లు



విజయవాడ, అక్టోబర్ 4: తిరుమల లడ్డూ వివాదంపై కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పందించారు. తిరుమల లడ్డూ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీలో సీబీఐ నుంచి ఇద్దరు, రాష్ట్రానికి చెందిన పోలీసు విభాగం నుంచి ఇద్దరు, ఫుడ్ సేఫ్టీ

అక్టోబర్4( రిపబ్లిక్ న్యూస్)

## తిరుమలలో అపచారం..



తిరుమల అక్టోబర్ 4( రిపబ్లిక్ న్యూస్) తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభంపై గరుడ ధ్వజ పటాన్ని ఎగురవేసే తాలూకు కొక్కి విరిగిపోయిందని.. ఇది అపచారం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని టీటీడీ ఖండించింది. దీనిని భక్తులు ఎవరు నమ్మొద్దని ఎక్స్‌లో టీటీడీ వివరణ ఇచ్చింది. తిరుమల శ్రీవారి ఆలయంలో అపచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేసింది.

### కుటుంబ సమేతంగా

## తిరుమల చేరుకున్న సీఎం



తిరుపతి, అక్టోబర్ 04 ( రిపబ్లిక్ న్యూస్) : తిరుమలలో కొలువైన కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమైనాయి. శనివారం ఉదయం తిరుమల శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. అందుకోసం శుక్రవారం సాయంత్రం గన్నవరం విమా నాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం చంద్రబాబు కుటుంబ సమే తంగా తిరుమలకు బయలు దేరారు. అయితే ఈ విమానం అనుకున్న సమయాని కంటే.. దాదాపు 30 నిమిషాలు ముందే బయలుదేరింది. దీంతో సీఎం చంద్రబాబు రేణుగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు.

2లో

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బస్తర్ రేంజ్‌లోని నారాయణ్‌పుర్– దంతెవాడ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇవాళ(శుక్రవారం) తుపాకుల మోత కలకలం రేపింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 30 మంది మావోలు మృతిచెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెల్లడించారు.

చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ, నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం అబూజ్‌మడ్‌లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇవాళ మధ్యాహ్న సమయంలో భద్రతా దళాలు, మావోలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఒకరిపై ఒకరు తూటాల వర్షం కురిపించుకుంటూ ఇరువర్గాలు భీకరంగా పోరాడుతున్నాయి.

అలాగే సెప్టెంబర్ 03వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో భారీ ఎన్‌కౌంటర్‌లో జరిగింది. బీజాపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోలు ఉన్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఎదురు కాల్పులకు దిగారు.. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో 9మంది మావోలు మృతిచెందారని అధికార వర్గాలు తెలిపాయి. ఘటన స్థలంలో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 303 సెల్ఫ్ లోడింగ్ రైపిల్స్‌తోపాటు 12 తుపాకులు దొరికినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## జగన్‌పై కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విసుర్లు

విభాగం నుంచి ఒకరితో కమిటీ వేసిందన్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు బయటకు తీయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. బీజేపీ గతంలో కూడా అనేక సార్లు గత ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగిందని గుర్తుచేశారు. సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అనేక హిందూ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు.

రథం తగులపెట్టినా, రాముడి తల తొలగించినా ఒక్కరిని కూడా జగన్ ప్రభుత్వం అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక హిందూ ఆలయాల్లో అపచారాలు చేసే విధంగా వ్యవహరించారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో తిరుమలలో సీఎం అయ్యిండి నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. స్వామివారికి పట్టువస్త్రాలను దంపతులు సమర్పించాలని హిందూ ధర్మం చెబుతుందని.. ఆయన శ్రీమతి అన్యమతాన్ని నమ్ముకున్నందున జగన్ ఒక్కరే పట్టు వస్త్రాలు ఇచ్చారని విమర్శించారు. "నేను వైఎస్ బిడ్డను.. నా తండ్రి చాలాసార్లు తిరుమల వెళ్లారు, నేను కూడా వెళ్లాను అని జగన్ చెబుతున్నారు. మీ తండ్రి కూడా ఏడు కొండలను రెండు కొండలుగా చేయాలని చూసింది వాస్తవం కాదా" అని ప్రశ్నించారు.

అన్యమతస్తులు తిరుమల వెళ్లడానికి డిక్లరేషన్ ఇవ్వడం ఎప్పటి నుంచో ఉందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగనే డిక్లరేషన్ తిరస్కరించారన్నారు. శాస్త్రానికి, ధర్మానికి వ్యతిరేకంగా పట్టు వస్త్రాలు సమర్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల విషయంలో మొదటి నుంచి జగన్ వైఖరి సరగా లేదన్నారు. ఇప్పుడు లడ్డూ వివాదంలో కూడా జగన్ ప్రభుత్వంలో తప్పు జరిగిందని నమ్ముతున్నామని తెలిపారు. వాస్తవాలు పూర్తిగా బయటకి తీసేలా సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ బృందాన్ని నియమించడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

### కుటుంబ సమేతంగా
## తిరుమల చేరుకున్న సీఎం

రేణుగుంట విమానాశ్రయం నుంచి నేరుగా తిరుమలకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. రాత్రికి తిరుమలలోనే చంద్రబాబు బస చేయనున్నారు. ఇక శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం పెద్ద శేష వాహనంలో స్వామి వారి ఉత్సవంలో సీఎం పాల్గొనున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు అమరావతికి తిరిగి పయనమవ్వనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసలు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం దాదాపు మూడు నెలల క్రితం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో సీఎం బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తొలిసారిగా కులదైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఈ నేపథ్యంలో లడ్డూకి పరీక్షలు నిర్వహించగా.. కల్తీ జరిగినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరపాలని నిర్ణయించారు. అందులోభాగంగా సర్వ శ్రేష్ట త్రిపాఠి సారథ్యంలో సిట్‌ను ఏర్పాటు చేశారు. మరోవైపు తిరుపతి లడ్డూ కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంపై టీటీడీ బోర్డ్ మాజీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి, బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

దాంతో ఈ వ్యవహారంపై జస్టిస్ బీ ఆర్ గవాయ్, కే.వీ. విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఆ క్రమంలో శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సిట్‌లో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరఫున ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒక సీనియర్ అధికారి సభ్యులుగా ఉండాలని సూచించింది. ఈ స్వతంత్ర్య దర్యాప్తు సిట్‌ను సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది.

## బలపనూరు వద్ద రోడ్డు ప్రమాదం



**పాణ్యం అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)** కారుతో ఒక వ్యక్తిని డీ కొట్టిన ఐకాన్ స్కూల్ యజమాని కృష్ణారెడ్డి ప్రమాదానికి కారణం రాంగ్ రూటే అని ప్రాథమిక సమాచారం

తన కారులోనే శాంతిరాం హాస్పిటల్ కి తీసుకు వచ్చిన కృష్ణారెడ్డి తలకు మరియు కాలుకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు వెల్లడి

## గోల్డ్ షాప్ యజామనులందరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



**నంద్యాల క్రైం, అక్టోబర్ 4, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు సిసిఎస్ ఇన్స్పెక్టర్ సురేష్, నంద్యాల 1 టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి ఆద్వర్యములో శుక్రవారం ఇటీవల జరుగుతున్న దొంగతనాల దృష్ట్యా నంద్యాల టౌన్ గోల్డ్ షాప్ యజమానులతో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి, వాచ్ మెన్ల నియామకము గురించి మరియు తగిన జాగ్రత్తల గురించి మీటింగ్ ఏర్పాటు జరిగినది. అదే క్రమములో దసరా పండుగ సందర్భముగా పట్టణ ప్రజలకు దొంగతనాలు, చైన్ స్నాచింగ్, పిక్ పాకెటింగ్, మోటార్ సైకల్ దొంగతనాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కూడా కొన్ని సూచనలు చేయడమైనది. పండుగల సందర్భముగా ఇంటికి లాక్ చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్ళేవాళ్లు తమ యొక్క డబ్బులు మరియు సొత్తు బ్యాంక్ లాకర్ లో గాని లేదా తమ వెంట గాని తీసుకొని వెళ్ళాలి. అలా వెళ్ళేవారు పోలీసు వారికి సమాచారము ఇస్తే మీ ఏరియాలో పోలీసు వారు గస్తీ ఏర్పాటు చేయడము జరుగుతుంది. బైకులు, స్కూటి లు ఇంటిలో పార్క్ చేసుకొని చైన్ తో లాక్ చేసుకోవాలి. ఊరిబయటకు వాకింగ్ కు వెళ్ళేవారు ఒంటరిగా వెళ్లరాదు. సాధ్యమైనంత వరకు ఇంపార్టెంట్, కాలనీలలో సీసీ కెమెరాలు ఇన్ స్టాల్ చేసుకోవాలి. ఊర్లకు వెళ్ళేవాళ్లు బ్యాగ్స్ లలో విలువైన వస్తువులు తీసుకొని వెళ్ళేప్పుడు జాగ్రత్తగా ఉండాలి ఏమరపాటుగా ఉండరాదు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు టౌన్ లో తిరిగితే సీజ్ చేయబడతాయి. గోల్డ్ షాప్ యజామనులందరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

# కమిషనరమ్మ.. తాళం వైపు చూడమ్మ

విశ్వనగరంలో హైదరాబాద్ నగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిలో 150 డివిజన్లు ఉన్నాయి. ఆయా డివిజన్ల పరిధిలో మహిళల కోసం కోట్లాది రూపాయిల ప్రజా ధనం వెచ్చించి మరుగుదొడ్లను జీహెచ్ఎంసీ నిర్మించింది. అయితే ఆ మరుగుదొడ్లకు ప్రస్తుతం తాళాలు దర్శనమిస్తున్నాయి. దీంతో నగరంలో మహిళలు కోసం కోట్లాది రూపాయిల ప్రజా ధనాన్ని వినియోగించి నిర్మించిన మరుగుదొడ్లకు ప్రస్తుతం తాళమనే గ్రహణం పట్టిందని సగటు నగర జీవి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఇప్పటికే ఎన్నికల హామీల్లో భాగంగా గత ప్రభుత్వ పాలకులు అయితేనేమీ, ప్రస్తుత పాలకులు అయితేనేమీ.. వివిధ పథకాలను ఉచితాల పేరుతో పప్పు బెల్లాల్లాగా పంచి పెడుతున్నారు. అందుకు గత ప్రభుత్వ హాయంలో ప్రస్తుత హయాంలో ఏ మాత్రం తీసుపోని పథకాలును అమలు చేస్తున్నారు. ఈ తరహా పథకాలతో ప్రభుత్వ ఖాజానా కాస్తా.. ఖాళీ ఖజానాగా దర్శనమిస్తుంది. దీంతో మెయింటెనెన్స్ చేసేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవు.

ఇప్పటికే విశ్వనగరంలోని వివిధ ప్రాంతాల్లో వీధి దీపాలు సైతం వెలగడం లేదు. ఇంకా సోదాహరణా చెప్పాలంటే.. ఇటీవల హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో రాత్రుళ్లు వీధి దీపాలు వెలగడం లేదంటూ కేంద్రమంత్రికి నగర వాసులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి.. అక్కడికే జీహెచ్ఎంసీ ఉన్నధికారులను పిలిపించి మాట్లాడారు. జీహెచ్ఎంసీ వద్ద నిధులు లేవని సదరు ఉన్నతాధికారులు.. కేంద్ర మంత్రికి స్పష్టం చేశారు. దీంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాస్తా తడబడిన.. సదరు ప్రాంతంలో లైట్లు వెలగాలంటూ వారిని ఆదేశించారు.

దీంతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారిందనే ఓ చర్చ అయితే తెలుగు రాష్ట్రాల్లో వైరల్‌గా మారింది. పార్టీల నేతలు గద్దెనెక్కేందుకు చూపించే ఊపు ఉత్సాహం.. ప్రజల కోసం.. ముఖ్యంగా మహిళల కోసం నిర్మించిన మరుగుదొడ్లకు వేసిన తాళల అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని నగర జీవులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వద్ద నిధులుంటే ఏమైనా చేయగలరు. కానీ నిధులే లేకుంటే జీహెచ్ఎంసీ అధికారులు




మాత్రం ఏం చేస్తారులే అని సగటు నగర జీవి మాత్రం ఓ నిటూర్పు విడిచి ఊరుకుంటున్నాడు. అయితే జీహెచ్ఎంసీ కమిషనర్‌గా మహిళ అధికారి ఉన్నారు. ఆమె అయినా ఈ సమస్యపై దృష్టి పెడతారని నగర జీవి ఆశిస్తున్నాడు.

# ఇద్దరు డిప్యూటీ సీఎంల మధ్య సనాతన వార్

ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ కొందరు సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, కొందరు వైరస్‌తో పోల్చారని.. ఇటువంటివి సరికాదంటూ ఉదయ్ నిధి స్టాలిన్ వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై స్పందించిన తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయ్ నిధి స్టాలిన్ స్పందిస్తూ.. వెయిట్ అండ్ సీ అంటూ వ్యాఖ్యానించారు. మరోవైపు తాము ఏ మతానికి వ్యతిరేకం కాదని డీఎంకే నేతలు వరుస ప్రకటనలు విడుదల చేశారు. మతం పేరుతో మూఢనమ్మకాలు, మోసాలకు తాము వ్యతిరేకమని తెలిపారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే వ్యక్తులు తమిళనాడు నుంచి తుడిచిపెట్టుకుపోయారంటూ డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఇళంగోవన్ పేర్కొన్నారు.

**ఏమన్నారంటే..**

సనాతన ధర్మాన్ని కొందరు వైరస్‌తో పోలుస్తున్నారని, ఇది ఎంతమాత్రం సహేతుకం కాదన్నారు. సనాతన ధర్మం ఇతర మతాలు, ధర్మాలను ద్వేషించదన్నారు. ఎవరైనా సనాతన ధర్మాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నిస్తే వారే తుడిచిపెట్టుకుపోతారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇప్పటికైనా సనాతన ధర్మంపై విమర్శలు మానాలని, ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సనాతన ధర్మాన్ని నాశనం చేయలేరని, అలా చేస్తే మీరే తుడిచిపెట్టుకుపోతారని.. తిరుపతి బాలాజీ పాదాల చెంత నుంచి చెబుతున్నా అంటూ పవన్ కళ్యాణ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని, చట్టాన్ని అమలు చేసేందుకు సనాతన ధర్మ పరిరక్షణ బోర్డులు ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ వారాహి డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించడానికి, దాని విశ్వాసాలకు హాని కలిగించే చర్యలను నివారించడానికి బలమైన చట్టం అవసరమిన, తక్షణమే ఈ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ బోర్డుకు ప్రతి ఏడాది ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని పవన్ కళ్యాణ్ కోరారు. తన ప్రసంగంలో డీఎంకే పార్టీ పేరును, ఆ పార్టీ నాయకుల పేర్లను ప్రస్తావించనప్పటికీ.. ఆ పార్టీ నేతలు పవన్ వ్యాఖ్యలపై స్పందించారు.

**డీఎంకే రియాక్షన్..**

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌తో పాటు ఎన్డీయే కూటమిపై డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఇళంగోవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే వ్యక్తులు తమిళనాడు నుంచి తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే వారు సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడు నుండి తుడిచిపెట్టుకుపోయారని, డీఎంకే క్లీన్‌స్వీప్ చేసిందన్నారు. బీజేపీ ఒక్కసీటును గెలుచుకోలేదని తెలిపారు. తాము అందరికీ సమాన హక్కులు ఉండాలని మాట్లాడుతున్నామని, మనుధర్మం గురించి మాట్లాడే వారు ఏ కులానికి చెందిన వారైనా ఆలయాల్లో పూజారులుగా ఉండేందుకు వీలు కల్పించే చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేయాలని ఇళంగోవన్ పేర్కొన్నారు.

సనాతన ధర్మంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. పక్కనే ఉన్న తమిళనాడులోని డీఎంకే నేతలు తీవ్రస్థాయిలో స్పందిస్తున్న నేపథ్యంలో జనసేన నేతలు ఎలాంటి కౌంటర్ ఇస్తారనేది ఉత్కంఠ రేపుతోంది.

# రుద్రవరం మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మి

### ఏవోగా సుబ్రమణ్యం...
### జూనియర్ అసిస్టెంట్ గా
### హరికృష్ణ బాధ్యతలు..

**రుద్రవరం,రిపబ్లిక్ న్యూస్** రుద్రవరం మండల అభివృద్ధి అధికారిగా భాగ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న మధుసూదన రెడ్డిని వెలుగోడు మండలానికి బదిలీ చేయడంతో ఆయన స్థానంలో భాగ్యలక్ష్మి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. అలాగే ఇక్కడ సూపరిండెంట్ గా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మిని పాణ్యం మండలం బదిలీ చేయడంతో ఆమె స్థానంలో కొత్తపల్లి మండలం ఏవోగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఇద్రూస్ ను గోస్పాడు మండలం బదిలీ చేయడంతో ఆయన స్థానంలో చాగలమరి మండలంలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న హరి కిషన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలలో కాలనీలను సందర్శించి సమస్యలు తెలుసుకోవాలని అప్పుడే సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందని కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజా ప్రతినిధులు పాత్రికేయుల సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శులు కార్యాలయం సిబ్బంది పూలమాల వేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె పంచాయతీ కార్యదర్శులతో పరిచయ సమావేశం నిర్వహించి ప్రధానంగా గ్రామాలలో పారిశుధ్యం



త్రాగునీతుపై నిర్లక్ష్యం చేయరాదని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పారిశుద్ధంపై దృష్టి సారించాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో సమస్యలు తన దృష్టికి రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ సమావేశంలో పిఓపిఆర్డి శ్రీనివాస శర్మ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్రఏ2047 జిల్లా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

**జిల్లాస్థాయి సమావేశంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛంద సంస్థలు, అన్ని సెక్టార్ల స్టేక్ హోల్డర్స్ వెల్లుబుచ్చిన అభిప్రాయాలు.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల ప్రతినిధి, అక్టోబర్ 04 రిపబ్లిక్ న్యూస్ ::** స్వర్ణాంధ్ర ఏ2047 ప్రణాళికలో భాగంగా రాబోయే 23 సంవత్సరాలలో నంద్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళిక రచన సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో స్వర్ణాంధ్ర 2047 జిల్లా దార్శనిక పత్ర ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల స్టేక్ హోల్డర్స్ లతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ పద్మజ, సిపిఓ, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 ప్రణాళిక నిమిత్తం జిల్లాస్థాయి ప్రణాళిక రూపొందిస్తున్న నేపథ్యంలో ప్రజలు, అన్ని సెక్టార్ల స్టేట్ హోల్డర్స్ భాగస్వాములై తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించి మండల స్థాయి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 60 వేల మందికి పైగా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తమ యొక్క అభిప్రాయాలు. పొందుపరిచాన్నారు. మానవ అభివృద్ధికి సంబంధించి ఆరోగ్యకరమైన జీవన విధానం, ఉన్నతమైన జీవన ప్రమాణాలు కలిగి ఉండడం, ఆనందంగా ఉండడం తదితర ఆరు పారామీటర్లను ఆధారం చేసుకుని ప్రపంచంలోని 193 దేశాలకు ర్యాంకింగ్ ఇస్తారని ఇందులో భారతదేశానికి 134 స్థానం ఉందన్నారు. స్వర్ణాంధ్రఏ2047 లక్ష్యసాధనతో ప్రపంచంలోనే మూడు అగ్రగామి దేశాల్లో భారతదేశం ఒకటిగా నిలపాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష ఆమె అన్నారు. రాష్ట్రంలోని నంద్యాల జిల్లాలో అపార వనరులు ఉన్నాయని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకునేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 9.68 లక్షల హెక్టార్ల భూమిలో 33% అడువులు ఉన్నప్పటికీ మరికొంత భాగం గ్రీనరీని పెంచుకోవాలన్నారు. 4 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, వాణిజ్య పంటలు పండిస్తున్నారన్నారు. 50 వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం ద్వారా పంటలు సాగు చేస్తున్నారన్నారు. 75 వేల హెక్టార్లలో శనగ పంటను మాత్రమే వేసి తొమ్మిది నెలలపాటు ఖాళీగా ఉంచుతున్న భూములను సాగులోనికి తీసుకురావాలన్నారు. అధిక రసాయనిక ఎరువులు వినియోగించి సారవంతం లేని భూములుగా మార్చారని సేంద్రియ ఎరువులను వినియోగించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 6 ప్రముఖ సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని దీంతో పాటు పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తే జిల్లా జిడిపి పెరుగుతుందన్నారు. పారిశ్రామిక రంగంలో నైపుణ్యాల కొరత ఉందని విద్యార్థి దశ నుండే ఆసక్తిగల రంగాలలో నైపుణ్యతనిచ్చి ఉపాధి మార్గాలను చూపాలన్నారు. ప్రతి ఇల్లు, వీధి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీగా తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. జిల్లాలో ఎకో టూరిజం ను టెంపుల్ టూరిజంకు అనుసంధానం చేసి ప్రకృతితో కలిసి జీవించేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందుకోసం యాత్రికులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుచేసి ఆదాయ మార్గాలను పెంచుకునే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సహజంగా లభించే వనరులు అయిన సోలార్, విండ్, వాటర్ తదితర సమీకృత వనరులతో వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 70 శాతం అక్షరాస్యత మాత్రమే ఉందని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఉన్న వనరులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆడపిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేయకుండా డిగ్రీ వరకు చదివించి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సుదీర్ఘ ఆలోచనలతో స్వర్ణాంధ్రఏ2047




రూపకల్పనకు అన్ని జిల్లాల నుంచి మండల, జిల్లా స్థాయి ప్రణాళికలను స్వీకరిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. సంపన్న కుటుంబాలు వ్యక్తులు కొంతమంది నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకొని జీవన ప్రమాణాలు పెంచే దిశలో ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని కలెక్టర్ వివరించారు. ఈ సమీక్షలో దాదాపు 35 మంది వ్యక్తులు తమ విలువైన సూచనలు, సలహాలు వెల్లుబుచ్చారని అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని రాబోయే 23 సంవత్సరాలలో నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించుకోవడానికి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, అన్ని సెక్టార్ల స్టేక్ హోల్డర్స్ సమిష్టిగా నంద్యాలను స్వర్ణ జిల్లాగా మార్చేందుకు సహకరించాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లో భాగంగా 2047 విజన్ కార్యచరణ ప్రణాళిక రూపొందించి ప్రపంచంలోని మూడు అగ్రగామి ఆర్థిక దేశాలలో భారతదేశాన్ని ఒకటిగా నిలపాలన్నదే ప్రధానమంత్రి గారి ఆశయం అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం కీలకమైన పాత్ర పోషించనుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అంతకుముందు పలువురు వక్తలు పాల్గొని తమ అమూల్యమైన సలహాలను జిల్లా స్థాయి కమిటీకి సూచించారు.

# దేవి శరన్నవరాత్రులలో రెండవ నవదుర్గగా

**బ్రహ్మ చారిణి అవతారం**

**నేడు ఇంద్రకీలాద్రిపై గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు..దర్శనం**

విజయవాడ అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్):

దుర్గాదేవి తొమ్మిది అవతారాల్లో రెండు వ రోజు బ్రహ్మ చారిణి

**అవతారం, భక్తులు ఈ అమ్మవారిని**
**బ్రహ్మ చారిణి ...( గాయత్రి దేవి )**

అని కూడా పిలుస్తారు, నవరాత్రులలో పూజించే నవదుర్గల్లో రెండవ అవతారమైన బ్రహ్మ చారిణి ...!! ధైర్యానికీ, శక్తికీ, తేజస్సుకూ ప్రతీకగా భక్తులు భావిస్తారు. ఆమె తన తేజస్సుతో పూజించినవారి పాపాలు, ఈతిబాధలు, రోగాలు, మానసిక రుగ్మతలు, భూత భయాలు దూరం చేస్తుంది.జపమాల, ఘంట, బాణం, పదునైన ఖడ్గం, శ్వేత పద్మం, పానపాత్ర, త్రిశూలం, ధనుస్సు, కమలం, గద ధరించి మహాలావణ్య శోభతో ప్రకాశిస్తుంది, ఈ మాత కృపవలన సాధకుని సమస్త పాపాలూ, బాధలూ తొలగిపోతాయి. ఈమె ఆరాధన సద్యః ఫలదాయకము. ఈమె నిరంతరమూ యుద్ధసన్నద్ధురాలై ఉన్నట్లు దర్శనమిస్తుంది కనుక భక్తుల కష్టాలను అతి శీఘ్రముగా నివారిస్తుంది,ఈ సింహవాహనను ఉపాసించేవారు సింహసదృశులై పరాక్రమశాలురుగా నిర్భయులుగా ఉంటారు,

ఈమె ఘంటానాదము సంతతము భక్తులను భూతప్రేతాది బాధలనుండి కాపాడుతూ ఉంటుంది, ఈ దేవీ స్వరూపము దుష్టులను అణచివేయటంలో, హతమార్చుటంలో అనుక్షణమూ సన్నద్ధురాలై ఉండునదేబీ అయినప్పటికీ భక్తులకూ, ఉపాసకులకూ ఈమె స్వరూపము మిక్కిలి సౌమ్యముగానూ ప్రశాంతముగానూ కనబడుతూ ఉంటుంది, ఈమెను ఆరాధించడంవల్ల సాధకులలో వీరత్వ నిర్భయత్వములతోపాటు సౌమ్యతా, వినమ్రతలు పెంపొందుతుంటాయి. వారి నేత్రాలలోని కాంతులు, ముఖవర్చస్సు, శరీర శోభలు ఇనుమడిస్తూ, సద్గుణములు వృద్ధిచెందుతుంటాయి, వారి కంఠస్వరములలో అలౌకికమైన దివ్యమాధుర్యము రాశిగా ఏర్పడుతుంది, బ్రహ్మ చారిణి ..దుర్గా దేవి ఎనిమిది చేతులతో ఉంటుంది. ఒక చేతిలో త్రిశూలం, ఒక దానిలో గద, ఒక చేతిలో ధనుర్బాణాలు, మరో చేతిలో ఖడ్గం, ఇంకో చేతిలో కమండలం ఉంటాయి. కుడి హస్తం మాత్రం అభయముద్రతో ఉంటుంది. బ్రహ్మ చారిణి దుర్గాదేవి పులి మీదగానీ, సింహం మీదగానీ ఎక్కుతుంది. ఈ వాహనాలు ధైర్యానికి, సాహసానికీ ప్రతీకలు. అమ్మవారి కిరీటంలో ఉండగా, ఫాలభాగంలో మూడో నేత్రంతో ప్రకాశిస్తుంది ఆ తల్లి, అమ్మవారు బంగారు వర్ణంలో మెరిసిపోతూంటుంది. శివుడు ఈ అమ్మవారి అందానికి ముగ్ధుడయ్యాడని పురాణోక్తి, పులి లేదా సింహవాహిని అయిన అమ్మవారు ధైర్య ప్రదాయిని. నిజానికి ఈ రూపం కొంచెం ఉగ్రమయినా, ఆమె ఎల్లప్పుడూ ప్రశాంత వదనంతోనే ఉంటుంది. ఉగ్రరూపంలో ఉండే ఈ అమ్మవారిని చండి, చాముండాదేవి అని పిలుస్తారు ఈ అమ్మవారిని ఉపాసించేవారు మొహంలో దైవ శోభతో ప్రకాశిస్తుంటారని భక్తుల నమ్మిక. వారు అద్భుతమైన తేజస్సుతో ఉంటారట. ఈ అమ్మవారిని పూజించేవారు విజయాన్ని అతిశీఘ్రంగా పొందగలరని భక్తుల విశ్వాశం. దుష్టులను శిక్షించేందుకు ఈ అమ్మవారు ఎప్పుడూ తయారుగా ఉంటుందని పురాణోక్తి. అలాగే తన భక్తులకు ప్రశాంతత, జ్ఞానం, ధైర్యం ప్రసాదిస్తుందిట ఈ అమ్మవారు. రాక్షసులతో యుద్ధం చేసే సమయంలో అమ్మవారి చేతిలోని ఘంట భీకరమైన శబ్దం చేసిందట. కొందరు రాక్షసులకు ఆ ఘంటానినాదానికే గుండెలవిసాయని దేవి పురాణం చెబుతోంది.

అయితే ఈ ఘంటానినాదం ఆమె భక్తులకు మాత్రం శుభదాయకమనీ, ఎంతో మధురంగా వినపడుతుందని ప్రతీతి. దుష్టులకు అమ్మవారి రూపం ఎంత భయదాయకమో, ఉపాసకులకు మాత్రం అంత ప్రశాంతంగా కనిపిస్తుంది. పురాణ చరిత్ర శివుడు, పార్వతి దేవిని వివాహం చేసుకోవడానికి ఒప్పుకున్న తరువాత ఆమె ఎంతో సంతోషిస్తుంది.

పార్వతీదేవి తల్లిదండ్రులైన మేనకా దేవి, హిమవంతులు కూడా పెళ్ళికి అంగీకరిస్తారు. పెళ్ళి రోజున శివుడు దేవతలతోనూ, మునులతోనూ, తన గణాలతోనూ, శ్మశానంలో తనతో ఉండే భూత, ప్రేత, పిశాచాలతోనూ తరలి విడిదికి వస్తాడు.

వారందరినీ చూసి పార్వతి తల్లి మేనకాదేవి కళ్ళు తిరిగి పడిపోతుంది. అప్పుడు అమ్మవారు చంద్రఘంటాదేవి రూపంలో శివునకు కనిపించి, తమ కుటుంబం భయపడకుండా ఉండేలా తన వేషం మార్చుకోమని ఆయనను కోరుతుంది.



అప్పుడు శివుడు రాజకుమారుని వేషంలో, లెక్కలేనన్ని నగలతో తయారవుతాడు. అప్పుడు ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులూ భయం పోయి శివుణ్ణి వివాహానికి ఆహ్వానిస్తారు.

ఆ తరువాత శివ, పార్వతులు వివాహం చేసుకుంటారు. అలా ప్రజల భయాన్ని పోగొట్టేందుకు అమ్మవారు మొదటిసారి ఇలా చంద్రఘంటా అవతారం ఎత్తింది.

శివ, పార్వతుల కుమార్తె కౌషికిగా దుర్గాదేవి జన్మించింది. శుంభ, నిశుంభులను సంహరించమని ఆమెను దేవతలు ప్రార్థించారు. ఆమె యుద్ధం చేస్తుండగా, ఆమె అందం చూసి రాక్షసులు మోహితులవుతారు.

అమెను తన తమ్ముడు నిశుంభునికిచ్చి వివాహం చేయాలని శుంభుడు కోరుకుని ధూమ్రలోచనుణ్ణి కౌషికిని ఎత్తుకురమ్మని పంపిస్తారు. అప్పుడు అమ్మవారు తిరిగి చంద్రఘంటా దుర్గా అవతారం ధరించి ధూమ్రలోచనుణ్ణి, అతని పరివారాన్ని సంహరిస్తుంది.అలా శుంభ, నిశుంభులతో యుద్ధంలో నవదుర్గా అవతారాల సమయంలో రెండోసారి అమెను తన తమ్ముడు నిశుంభునికిచ్చి వివాహం చేయాలని శుంభుడు కోరుకుని ధూమ్రలోచనుణ్ణి కౌషికిని ఎత్తుకురమ్మని పంపిస్తారు. అప్పుడు అమ్మవారు తిరిగి చంద్రఘంటా దుర్గా అవతారం ధరించి ధూమ్రలోచనుణ్ణి, అతని పరివారాన్ని సంహరిస్తుంది.

అలా శుంభ, నిశుంభులతో యుద్ధంలో నవదుర్గా అవతారాల సమయంలో రెండోసారి బ్రహ్మ చారిణి గా దుర్గా అవతారంగా విశ్వసించి కొలుస్తారు.

# సనాతన ధర్మదీపికలు రామాయణ, భారత, భగవద్గీతలు.



**డాక్టర్ తొగటసురేశ్ బాబు, ధార్మికోపన్యాసకులు.**

**ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**

తుగ్గలి, సెప్టెంబర్ 4,రిపబ్లిక్ న్యూస్
లోకాస్సమస్తాస్సుఖినోభవంతు అంటూ విశ్వకల్యాణాన్ని కాంక్షించే హిందూ సనాతన ధర్మానికి తరాలు మారినా యుగాలు గడచినా చెదరని దీపికలుగా నిలిచేవి భారత, రామాయణ, భాగవత, భగవద్గీత లేనని వాటి అధ్యయనం, ప్రవచనము నిరంతరం జరగాలని, వాటి ద్వారా వ్యక్తి, కుటుంబ, సామాజిక, దేశ ధర్మాలను తెలుసుకునే వీలు కలుగుతుందని, గోవు సకల దేవతాస్వరూపమని , గోసేవ దేవతాసేవ మాత్రమేకాక దేశసేవ అవుతుందని ధార్మిక ప్రవచకులు డాక్టర్ తొగట సురేశ్ బాబు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, మారెల్ల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధార్మిక సభా కార్యక్రమంలో మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచకులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ తొగట సురేశ్ బాబు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్



ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ సుగుణావతమ్మ, సలహాదారులు యర్రం సుధాకర రెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ.కోదండరాం, తలారి అంజి, మాజి ఎంపిటిసి ఈడిగ వెంకట రాముడు, భజన మండలి అధ్యక్షులు చాకలి పెద్దయ్య, నక్క శివశంకర్, మంకె.లింగన్న, వై.కౌలుట్ల, పి.రామాంజనేయులు, తలారి లక్ష్మీ నారాయణ, సుధాకర్, ఉపాద్యాయులు రవీంద్రనాథ్ ఇ.దృవమూర్తి, యం.పెద్దయ్య, భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణరంగ కార్మికులు అందరూ లేబర్ కార్డు తీసుకోండి

**- మీ భవిష్యత్తును సురక్షితం చేసుకోండి**

నంద్యాల అక్టోబర్ 4 ( రిపబ్లిక్ న్యూస్):

స్థానిక నబీ నగర్ నందు ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షులు మస్తాన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గురువయ్య, ట్రెజరర్ వెంకట్ ల ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో జరిగిన లేబర్ కార్డు డ్రైవ్ లో ముఖ్యఅతిథులు గా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వై. విద్యావతమ్మ, జూనియర్ అసిస్టెంట్ మన్సూర్ లు పాల్గొన్నారు.

మస్తాన్ మాట్లాడుతూ ఈ సమావేశంలో సుమారు 50 మంది ప్లంబర్ లు పాల్గొన్నారనీ, ఇంతవరకు 350 మంది ప్లంబర్ లు కార్డు తీసుకుని ఉన్నారని, నేటి సమావేశంలో ఇంకొక 20 మంది కార్డులు తీసుకున్నారనీ తెలియజేశారు.

వై విద్యాలతమ్మ మాట్లాడుతూ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 18 నుండి 60 సంవత్సరాలు కలిగిన లబ్ధిదారులు చేరవచ్చుననీ, ఫామ్ నంబర్ 27, 2 ఫోటోలు, ఆధార్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్, నామిని బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, విఆర్ఓ ధ్రువీకరణ పత్రం మరియు సభ్యత్వ రుసుము 50/- రూపాయలు, సంవత్సర చందా 12/-, ఐదు సంవత్సరాలకు ఒకసారి 110/-, జీవో నెంబర్ 33 ప్రకారం ఐదు సంవత్సరాలకు ఒకసారి నవీకరణ చేసుకునే అవకాశం ఉందని తెలియజేశారు.

ఈ పథకం ద్వారా లభించే సంక్షేమ పథకాల గురించి మాట్లాడుతూ, కార్మికుని కుమార్తె వివాహ కానుక, కార్మికురాలి/కార్మికుని భార్యకు రెండు కాన్పుల వరకు ప్రసూతి సహాయం 20,000/-, కార్మికుడి సాధారణ మరణం తర్వాత వారి కుటుంబ సభ్యులకు 60,000/- ఆర్థిక సహాయం, దహన సంస్కారాల ఖర్చు 20,000/-, కార్డు కలిగి వుండి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికునికి 5,00,000/- అంగవైకల్యం పొందిన కార్మికునికి అంగవైకల్యాన్ని బట్టి గరిష్ట గా 5,00,000/-, కార్మికుల పిల్లలు 9,10,ఇంటర్ చదివే వారికి సంవత్సరానికి 1200/- వృత్తి విద్యా కోర్సులు చదివే వారికి 5000/- ఆర్థిక



సహాయం లభిస్తాయని వివరించారు.

చొరవ తీసుకొని తమ కార్మికులందరికీ లేబర్ కార్డు లు ఇప్పిస్తున్న ప్లంబర్ అసోసియేషన్ నాయకులను మెచ్చుకున్నారు. భవన నిర్మాణ కార్మికులందరూ ఇలాగే చొరవ తీసుకొని తమ కార్డులు పొంది తమ భవిష్యత్తును పదిలం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేశ్వర్లు, కరీముల్లా, మాబాషా, ఫక్రుద్దీన్, ఫరూక్, జావిద్, సర్దార్, మన్సూర్ బాషా, భూపాల్, రవి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి

**నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**

నంద్యాల అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్) గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో అక్టోబర్ 8 వ తేదీ స్థానిక బొమ్మల సత్రం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు

ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న , స్కిన్ హబ్ కోఆర్డినేటర్ మస్తాన్ వలి , 36వ వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి తో కలిసి నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పోస్టర్లను రిలీజ్ చేశారు

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు . 4 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని . దాదాపు 338 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు . నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు . 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు . ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.




# కుక్కలు బాబోయ్ కుక్కలు



నంద్యల బొమ్మలసత్రం అక్టోబర్ 5బీ రిపబ్లిక్ న్యూస్: నంద్యాల పట్టణంలో కుక్కల సైర్వ్య వి హారం మున్సిపల్ అధికారులు నంద్యాల పట్టణ ప్రజలను పట్టించుకోండి దాదాపుగా 42 వార్డులలో విపరీతంగాకుక్కలు ఉన్నాయి కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్న గాని మున్సిపల్ అధికారులు కానీ అధికారులు కానీ ఏ ఒక్కరు పట్టించుకోకపోవడం చాలా బాధాకరం కుక్కలు చిన్న పిల్లలపై పెద్దలపై ఎటునుంచి ఎక్కడ దాడి చేస్తాయో అని ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని తిరుగుతున్నారు ఎందుకంటే వాహనాల వెంటపడి కూడా ప్రజలను త్రీవ ఇబ్బందులు గురి చేస్తున్నాయి ప్రతి ఒక్క వార్డులో విపరీతంగా ఉన్నాయి ఏదైనా పెద్ద ప్రమాదం జరగ ముందే మున్సిపల్ అధికారులు కుక్కల బెడద నుంచి నంద్యాల పట్టణ ప్రజలను కాపాడాలని ఎదురుచూస్తూ ఉన్నారు. ఎందుకంటే కుక్కలు ఎక్కువగా పసి పిల్లలపై దాడులు చేసే ప్రమాదం ఉంది నంద్యాల మున్సిపల్ కమిషనర్ గారు నంద్యాల పట్టణ ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్న కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతూన్నరు..


# క్రీడాభారతి ఆధ్వర్యంలో ఫుట్ బాల్ శిక్షణ



నంద్యాల అక్టోబర్ 4( రిపబ్లిక్ న్యూస్): 9 నుండి 15 సంవత్సరాల లోపు వయసుగల బాలురకు ఉచిత ఫుట్ బాల్ క్యాంపు శుక్రవారం లి సాయంకాలం 4:30 గంటలకు బాలాజీ కాంప్లెక్స్ నందలి శాంతినికేతన్ స్కూల్ ఆవరణలో నిర్వహించడం జరిగినది. ఈ కోచింగ్ క్యాంప్ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు సాయంకాలం 5 గంటల నుండి 7 గంటల వరకు జరుగుతుందని,

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రీడాభారతి రాయలసీమ జోనల్ అధ్యక్షులు లి రామకృష్ణారెడ్డి శాంతినికేతన్ స్కూల్ కరెస్పాండెంట్ , క్రీడాభారతి నంద్యాల అధ్యక్షులు సుధాకర్ , ప్రధాన కార్యదర్శి లినిమ్మకాయల సుధాకర్ లు తెలిపారు. నంద్యాల జిల్లా లిఫుట్ బాల్ అసోసియేషన్, క్రీడాభారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఫుట్ బాల్ అసోసియేషన్ నిర్వాహకులు రాజా, కిరణ్, అఖిల్ లతోపాటు సుమారుగా 40 మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణవాసులు అందరూ కూడా ఈ ఉచిత శిక్షణ శిబిరాన్నిఉపయోగించుకుని రాబోయే రోజులలో పిల్లలు గొప్ప స్థాయిలో రాణించడానికి ఈ శిక్షణ ఉపయోగపడాలని వారు ఆశ భావంవ్యక్తం చేశారు. క్రీడాభారతి జిల్లా అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ మొబైల్స్ కి అడిక్ట్ కాకుండా ఈ ఆటలో మంచి ప్రావిణాన్ని సంపాదించి రాబోయే రోజుల్లో ఫుట్బాల్ ఆటను. నంద్యాల నుండి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. క్రీడాభారతి నాలుగు నెలల క్రితం నంద్యాలలో పురుడు పోసుకుని ఫుట్ బాల్ ఆటతోనే మొదలు కావడం మరియు అదే ఆటకు శిక్షణ అందించడం చాలా ఆనందంగా ఉందని దీనికి సహకరించిన ఫుట్ బాల్ అసోసియేషన్ నిర్వాహకులు అందరినీ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రీడా భారతి ట్రెజరర్ రమేష్ కమిటీ మెంబర్లు రమణ, గోపి పీఈటీలు, కోచ్ లు పాల్గొన్నారు . ఆసక్తి కలవారు ఈ నెంబర్లకు సంప్రదించాలని 7981686132,8340969885కోరారు

# శ్రీ బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో ఉమాదేవి అమ్మవారు



బండి ఆత్మకూరు,అక్టోబర్ 4, (రిపబ్లిక్ న్యూస్):- నల్లమల అటవీ ప్రాంతంలోని అతి పురాతన శైవ క్షేత్రం ఓంకార క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉమాదేవి అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజామునే అర్చకులు అమ్మవారిని శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరణ చేశారు.వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం భక్తులు శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి చేరుకొని అక్కడ స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు ఉచిత అన్నదాన ప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగప్రసాద్ వసతి సదుపాయాలు కల్పించారు.

# మద్యం దుకాణాల టెండర్లు విధానం సులభం




నంద్యాల క్రైం, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): నూతన మద్యం పాలసీలో దుకాణాల టెండర్లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో గుత్తేదారుడు సులభంగా ధరఖాస్తు చేసుకోవచ్చునని ఉమ్మడి జిల్లాల అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టెండర్లు వేయడానికి ఎక్సైజ్ స్టేషన్లలో అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎవరైన వ్యక్తులు అబ్కారీ స్టేషన్కు వచ్చి నేరుగా వచ్చి ధరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిజిటల్ సహాయకులు, బ్యాంకు సిబ్బందిని కూడా అందుబాటులో ఉన్నారన్నారు. 9వ తేది సాయంత్రం 5 వరకే గడువుందన్నారు. ఈనెల 11న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టెండర్లకు సంబంధించిన లాటరీ తీస్తారని 12వ తేది నుంచి నూతన మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. 105 దుకాణాలకు గాను ఇప్పటి వరకు 15 మంది టెండర్లు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఈఎస్ రవికుమార్, సీఐ కృష్ణమూర్తి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



రుద్రవరం,(రిపబ్లిక్న్యూస్) గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి శైలజ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఐ సి డి ఎస్ సి డి పి ఓ తేజస్విరి, లాయర్ రిసోర్స్ పర్సన్ రమాదేవి, లాయర్ విజయ్, ఈఓ పి ఆర్ డి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి, ఐదవ అదనపు జిల్లా జడ్జి మండల న్యాయ సేవా సంఘం ఆళ్లగడ్డ చైర్మన్ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళలకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. మహిళలకు ఉచితమైన న్యాయ సహాయం ఉంటుందని ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఒకటి ఐదు 15100 ఫోన్ చేసి ఫిర్యాదులను తెలుపవచ్చు అన్నారు. ప్రతి మహిళకు రక్షణగా వన్ స్టాప్ సెంటర్లు ఉన్నాయని మహిళకు సంబంధించిన కేసులను తమ దృష్టికి తీసుకుని రావచ్చునని హెల్ప్ లైన్ 181 సంప్రదిస్తే తక్షణమే వారికి రక్షణ కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంభూపాల్ రెడ్డి మహిళలు ఐసిడిఎస్ సిబ్బంది కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భారీ విరాళం



**తెలంగాణ అక్టోబర్ 4:(రిపబ్లిక్ న్యూస్)** వరద బాధితుల సహాయార్థం తెలంగాణ సీఎం సహాయ నిధికి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రూ.1,01,75,000 విరాళం అందించింది. అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహారెడ్డి, సురేందర్ పాటు ఇతర ముఖ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ ను కలిసి ఆ మేరకు చెక్కును అందించారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం కార్యక్రమాలకు అండగా విరాళం అందించినందుకు వారిని సీఎం అభినందించారు.

## జిల్లాలో విజిబుల్ పోలీసింగ్, ఎన్ఫోర్స్మెంట్ పై ప్రత్యేక దృష్టి

### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



**నంద్యాల క్రైం, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్ పరిధిలలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు అధికారులు వారి సిబ్బంది సహాయంతో, క్యూర్.ఆర్.టీంలతో నాటు సారాయిపై విస్త్రుత దాడులు నిర్వహించడం జరిగింది. ఈ దాడులలో 12 కేసులు నమోదుచేసి 143 లీటర్ల సారాయిని, 165 (180 ఎం ఎల్ ) అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. నంద్యాల జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ పరిధిలలో విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా పోలీసు అదికారులు వారి సిబ్బంది సహాయంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టగా మొత్తం 14 కేసులు నమోదు కావడం జరిగింది. ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా భహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై 64 కేసులు నమోదు చేయడంతో పాటు బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయుచున్న వాపై చర్యలలో భాగంగా 60 కేసులు నమోదు చేసి 5490 రూపాయలను జరిమానా విధించడం జరిగింది. 01 మట్కా కేసు నమోదు చేసి 04 అరెస్ట్ చెయ్యడంతో పాటు 2200 రూపాయలను తదుపరి చర్య నిమిత్తం స్వాధీనం చేసుకోవడం జరిగింది. నంద్యాల జిల్లా డోన్ సబ్ డివిజన్ లోని డోన్ టౌన్, ప్యాపిలి సర్కిల్ పరిధిలోని గ్రామ శివారు ప్రాంతాలలో జూదం ఆడుచున్నారనే సమాచారం మేరకు పోలీసు అదికారులు వారి సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించి 02 కేసులు నమోదు చెయ్యడంతో పాటు 08 మందిని అరెస్ట్ చేసి 24250 రూపాయలను తదుపరి చర్య నిమిత్తం స్వాధీనం చేసుకోవడం జరిగింది. జిల్లాలో మోటార్ వెహికల్ చట్టం అమలుచేస్తు 331 కేసులు నమోదు చేసి 1,43,200 రూపాయలను జరిమాన విధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎవరైన చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడిన చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వాహనదారులు ట్రాఫిక్ రోడ్డు భద్రత నిభందనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని తెలియజేశారు.



## ఎంపీడీవోగా దస్తగిరి బాధ్యతల స్వీకరణ



**బండి ఆత్మకూరు,అక్టోబర్ 4, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండల అభివృద్ధి అధికారిగా దస్తగిరి బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో వాసుదేవ గుప్తా సాధారణ బదిలీల్లో భాగంగా గడివేముల మండలానికి బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో పాణ్యం మండలం ఎంపీడీవో గా పనిచేస్తున్న దస్తగిరిని బండి ఆత్మకూరు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.ఈ క్రమంలో మండల పరిషత్ సిబ్బంది ఏవో హనీఫ్ ఖాన్,జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ శర్మ,టైపిస్ట్ వడ్ల ఫణీంద్ర కుమార్ లు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### పంచాయితీ రాజ్ ఏఈ గా వెంకట రాముడు



అలాగే బండి ఆత్మకూరు మండలం పంచాయితీ రాజ్ ఏఈగా వెంకట రాముడు బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ పనిచేస్తున్న ఏఈ వెంకటయ్య బదిలీ అయ్యారు.అలాగే మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గా టీవీ చంద్రమౌళి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంపీడీవో దస్తగిరి పంచాయతీ సెక్రెటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి-ఎం.ఎల్.ఎ



**పాణ్యం ( ప్రజా రిపబ్లిక్ న్యూస్):** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కార్యాలయానికి చేరుకొని బాధితుల నుంచి వ్యక్తిగత, సామూహికంగా, ఉన్న సమస్యలను దరఖాస్తుల రూపంలో తీసుకున్నారు. దరఖాస్తులను అధికారికంగా నమోదు చేసి ఎమ్మెల్యే ద్వారా వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల చేత కూడా పరిష్కార మార్గాలను బాధితులకు వివరించే విధంగా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గ కేంద్రంలో మొట్టమొదటిసారిగా ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం చుట్టామని ఇందుకోసం బాధితులు వ్యక్తిగతంగా, సామూహికంగా తమకు ఉన్న ఇబ్బందులను, సమస్యలను, అధికారుల దృష్టికి తీసుకుని వస్తే వారు సామరస్యంగా పరిష్కరించాలని తెలిపారు. ఇప్పుడు అందిన సమస్యలను వచ్చే పరిష్కార వేదిక సమయంలోపల పూర్తి చేయాలని, పాతవి పెండింగ్లో లేకుండా కొత్త సమస్యలను పరిష్కరించుకునే విధంగా అధికారులు స్వచ్ఛంగా ఉండాలని తెలిపారు. ప్రజా సమస్యలలో ముఖ్యంగా అర్హులైన వారికి



పింఛన్లు, కావాలని ఇంటి స్థలాలు, పక్కా ఇల్లు కావాలని, పొలాలు సమస్యలతో, దరఖాస్తులు వందలాదిగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిక్షిప్తమయ్యాయి. కార్యక్రమంలో తాసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, మండల టిడిపి కన్వీనర్ జయరామిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ శివశంకర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల నుంచి వచ్చినటువంటి ప్రజలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం.



**నంద్యాల, సెప్టెంబర్ 4, రిపబ్లిక్ న్యూస్ ::** జిల్లా వనరుల కేంద్రము, నంద్యాల ఆధ్వర్యంలో నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో వ్యవసాయ శాఖ లోని క్షేత్రస్థాయి సిబ్బంది అయిన గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, ఎంపిఇవో లకు శుక్రవారం ఒక్కరోజు నైపుణ్యాబివృద్ధి శిక్షణా కార్యక్రమము నిర్వహిండం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల నుండి బాలాజీ నాయక్ , వెంకట రమణమ్మ హాజరయ్యారు. బాలాజీ నాయక్ వరి, మినుము పంటలలో పంటలను ఆశించు పురుగులు వాటి నివారణ చర్యలు తెలియజేసారు. వెంకట రమణమ్మ వివిధ పంటలలో వ్యాపించే తెగుళ్లు మరియు వాటి నివారణ చర్యలు తెలియజేసారు. స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు, నంద్యాల, డి.రాజశేఖర్ గారు వ్యవసాయ శాఖ లో అమలవుతున్న వివిధ రకాల పథకాల గురించి తెలియజేస్తూ, ఇంకా ఇ-కేవైసి చేయని రైతులకు 07.10.2024 వ తేదీ లోపు పూర్తి చేయాలని తెలియజేసారు. అలాగే జిల్లా వనరుల కేంద్రం, సహాయ వ్యవసాయ సంచాలకులు సరాలమ్మ గారు మట్టి పరీక్షలు తీసే విధానము మరియు భూసార ఆధారిత ఎరువుల వాడకం వలన కలిగే ఉపయోగాలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో బనగానపల్లె మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, నంద్యాల మండల వ్యవసాయ అధికారి, ప్రసాద రావు, నంద్యాల సబ్ డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న వి ఏ ఏ, వి హెచ్ ఏ, ఎంపీఈవో తదితరు లు పాల్గొన్నారు.



## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే నిర్వహణ

### సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత
### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా




**నంద్యాల క్రైం, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆరు పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియజేశారు.

## భలే భలే లక్కీ ఛాన్స్ లే కార్యక్రమం ప్రారంభించిన నంద్యాల జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు భవనాసి నాగమహేష్



**నంద్యాల (ప్రజా రిపబ్లిక్)అక్టోబర్ 4:** నంద్యాల లో అమావారిశాల నందు దసరా శరణవరాత్రులు సందర్భంగా వైశ్య యువజన సంఘం నిర్వహిస్తున్న భలే భలే లక్కీ ఛాన్స్ లే వినూత్న కార్యక్రమం ప్రారంభించిన నంద్యాల జిల్లా అధ్యక్షుడు భవనాసి నాగమహేష్.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఇలాంటి వినూత్న కార్యక్రమంకు శ్రీకారం చుట్టిన వైశ్య యువజన సంఘం వారిని అభినందిస్తూ తనను ఆహ్వానించినందుకు ముందుగా ధన్యవాదములు తెలియచేశారు అలాగే మును ముందు ఇలాంటి కార్యక్రమలు నిర్వహిస్తూ ఆర్య వైశ్యులు నూతన ఉత్సాహం నిలపాలి అన్ని కోరారు.యువజన సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణకు తమ సహాయ సహకారాలు అందించిన శ్రీ వాసవి సంఘం అధ్యక్షుడు భవనాసి శ్రీనివాస కి,కార్య వర్గ సభ్యులకు మరియు దాతలు అయిన శ్రీ భవనాసి నాగమహేష్, కూర ప్రసాద్, పబ్బటి వేణు,మేడం రూత్విక్ మరియు గంగిశెట్టి దీపక్ గార్లకు ప్రత్యేక ధన్యవాదములు



తెలియచేశారు. ఈ కార్యక్రమం నందు జిల్లా సంఘం అధ్యక్షుడు భవనాసి నాగమహేష్, వాసవి సంఘం కార్యదర్శి బైసాని రామ శేషు,కోశాధికారి అడగళ్ళ మధుసూదన్,ఉపాధ్యక్షుడు మిరియాల రాంప్రసాద్, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్,కార్యదర్శి సునీల్, కోశాధికారి సుమంత్, ఉపాధ్యక్షుడు కూర ప్రసాద్, కమిటీ మెంబర్లు డాక్టర్ శ్రవణ్, పవన్,గుండా మనోజ్, మామిళ్ళ పవన్,రూత్విక్, భారత్ తదితరులు పాలుగోన్నారు.

## పంట కోతఅనంతరంకొయ్యలను కాల్చద్దు..ఏవో పవన్ కుమార్.

**వెలుగోడు అక్టోబర్ 4 రిపబ్లిక్ న్యూస్** వెలుగోడు మండలం గుంతకందాల అబ్దుల్లాపురం గ్రామంలో సాగుచేసిన మొక్కజొన్న మినుము పంటలను ఏవో పవన్ కుమార్ శుక్రవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ మొక్కజొన్న దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని,సాధారణ దిగుబడులు 25 నుండి 30 కుంటలు ఎకరానికి ఉండగా ఈ ఏడాది ఖరీఫ్ మొక్కజొన్న దిగుబడులు ఎకరానికి 32 నుండి 35 క్వింటాలు రావచ్చని భావిస్తున్నారు.మండలంలో పలు గ్రామాలలో ఇప్పటికే మొక్కజొన్న కోతలు ప్రారంభమైనాయి,రైతులు పంట కోత అనంతరం పొలంలో పంట కొయ్యలను కాల్చరాదని అలా కాలుస్తే భూమిలోని సూక్ష్మ పోషకాలు అంతరించిపోయి భూమి యొక్క సేంద్రీయ కర్బనము తగ్గుతుందని రైతులకు తెలియజేశారు.



కొయ్యలకు నిప్పుపెడితే రైతులకు నష్టం, భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గుతుంది, పొలాన్ని కలియ దున్నితేనే పంటలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి రైతులు పలువురు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..



ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బస్తర్ రేంజ్‌లోని నారాయణ్‌పుర్- దంతెవాడ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇవాళ(శుక్రవారం) తుపాకుల మోత కలకలం రేపింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 30 మంది మావోలు మృతిచెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెల్లడించారు.

చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ, నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం అబూజ్‌మడ్‌లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇవాళ మధ్యాహ్న సమయంలో భద్రతా దళాలు, మావోలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఒకరిపై ఒకరు తూటాల వర్షం కురిపించుకుంటూ ఇరువర్గాలు భీకరంగా పోరాడుతున్నాయి.

అలాగే సెప్టెంబర్ 03వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో భారీ ఎన్‌కౌంటర్‌లో జరిగింది. బీజాపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోలు ఉన్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఎదురు కాల్పులకు దిగారు.. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో 9మంది మావోలు మృతిచెందారని అధికార వర్గాలు తెలిపాయి. ఘటన స్థలంలో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 303 సెల్ఫ్ లోడింగ్ రైపిల్స్‌తోపాటు 12 తుపాకులు దొరికినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ఉచిత ఇసుక వాగ్దానం అమలు ఎక్కడ బాబు గారు... సిపిఎం

**వెలుగోడు అక్టోబర్ 4 రిపబ్లిక్ న్యూస్** వెలుగోడు మండల రెవెన్యూ కార్యాలయం దగ్గర సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉచిత ఇసు క అమలు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ వెలుగోడు మండల నాయకులు మహమ్మద్ రఫీ సిఐటియు మండల అధ్యక్షులు నాగ మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉచిత ఇసుక ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్న ఉచిత ఇసుక అమలు చేయడం లేదన్నారు.గత ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని ఈ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఉచిత ఇసుక అమ్ములు కానందున భవన నిర్మాణ కార్మికులు వలసలు వెళ్లిపోయారు.గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు అధిక ధరలకు ఇసుకను కొనలేక ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి ఇప్పటికీ ఒక పథకం తప్ప మిగతా అన్ని పథకాలను గాలికి వదిలేస్తుందన్నారు.అధికారంలోకి రాకముందు ఒక మాట అధికారంలోకి వచ్చిన తర్వాత మరొక మాట కూటమి ప్రభుత్వం చెబుతుందన్నారు.గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు ఇసుక దొరకక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ,ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచించి రాబోవు రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలుపుకోవాలన్నారు.లేకపోతే ర గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని వారు హెచ్చరించారు సిపిఎం . పార్టీగా ఇచ్చిన వాగ్దానాలు అమలు కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు . అనంతరం రెవెన్యూ కార్యాలయ అధికారులకు డిమాండ్ పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించారు .ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటయ్య,రామకృష్ణ, జి భాష, రహంతుల్లా,ఎర్ర భాష,కిషోర్, కరిముల్లా,కృష్ణ, నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com